www.kalamdaily.com

Follow on:
Kalamtelugu

# కలం
ప్రజల గళం...

09-03-2026, సోమవారం పేజీలు: 3

వార్ ఎఫెక్ట్ 360° SINGLE TOPIC




## ఒక్క డాలర్ పెరిగితే ఏడాదికి 12వేల కోట్ల భారం

- దేశవ్యాప్తంగా రోజుకు సుమారు 12 కోట్ల లీటర్ల పెట్రోల్, 26 కోట్ల లీటర్ల డీజిల్ యూజ్ చేస్తున్నాం. క్రూడాయిల్ ధర బ్యారెల్‌పై 1 డాలర్ పెరిగితే ఇండియా చెల్లించాల్సిన వార్షిక దిగుమతి బిల్లు సుమారు రూ.12వేల కోట్ల వరకు పెరుగుతుంది. ప్రతి 10 డాలర్ల పెంపు వల్ల దేశ జీడీపీ వృద్ధి రేటుపై 0.5 శాతం వరకు ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.
- చమురు కోసం ఎక్కువ డాలర్లు ఖర్చు చేయడంతో రూపాయి విలువ కూడా బలహీనపడుతున్నది.

# ఇరాన్‌లో వార్
# ఇక్కడ బేజార్

## భగ్గుమంటున్న ధరలు.. ఆందోళనలో సామాన్యులు

### ఇప్పటికే పెరిగిన సిలిండర్ రేట్లు.. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే చాన్స్

### స్ట్రీట్ ఫుడ్ నుంచి ఫైవ్ స్టార్ హోటల్‌లో బిర్యానీ రేట్ల వరకు 10% హైక్

### ఎగుమతులకు, దిగుమతులకు తీవ్ర ఆటంకాలు

*ఇరాన్‌లో వార్.. ఇప్పుడు వంటింట్లోకి వచ్చేసింది! వంట గ్యాస్ ధరలు పెరగడం.. ఏ క్షణమైనా పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరగొచ్చన్న అనుమానాలు.. పేద, మధ్య తరగతి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీని ఎఫెక్ట్ మరింత పెరిగే ప్రమాదం ఉందని జనం కలవరపడుతున్నారు.*

*నిత్యావసర వస్తువుల ధరలను హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో వ్యాపారులు పెంచేస్తున్నారు. కొందరు బ్లాక్ మార్కెట్ దందాకు తెరతీస్తున్నారు. నిన్న మొన్నటి వరకు 40 రూపాయలకు ప్లేట్ ఉన్న ఇడ్లీని ఇప్పుడు కొన్ని చోట్ల 50, 60 రూపాయలకు అమ్ముతున్నారు. బుక్ చేసుకున్న రెండురోజుల్లోపు రావాల్సిన ఎల్పీజీ సిలిండర్ కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తున్నది.*

*గత నెల 28న ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దాడులతో మొదలైన యుద్ధానికి ఎప్పుడు ఫుల్ స్టాప్ పడుతుందో తెలియని పరిస్థితి. ఇది ఇంకా కొనసాగితే.. లోకల్ గా సామాన్యులు, చిరువ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఎలాంటి ఆందోళన అవసరం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్తున్నప్పటికీ ప్రజల్లో మాత్రం భయాందోళనలు కంటిన్యూ అవుతున్నాయి. భవిష్యత్ పరిణామాలు ఎలా ఉంటాయోనని కొందరు ముందే అలర్ట్ అవుతున్నారు. ఇంటికి కావాల్సిన వస్తువులను ఎక్కువ మోతాదులో తెచ్చిపెట్టుకుంటున్నారు.*

*వీటన్నింటిపై కలం 360 డిగ్రీస్ కథనం..*

తెలంగాణ బ్యూరో, కలం




## పెట్రోల్ రేట్ పెరుగుతదా?

ఇరాన్ వార్ ఎఫెక్ట్ తో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగొచ్చని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. వార్‌కు ముందు క్రూడాయిల్ రేట్ బ్యారెల్‌కు 60 డాలర్ల వరకు ఉండగా.. సోమవారం ఏకంగా 115 డాలర్లకు చేరుకుంది. క్రూడాయిల్ ను మనం ఎక్కువగా గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటాం. పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని సోషల్ మీడియా వేదికగా న్యూస్ చక్కర్లు కొడుతుండటంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. హర్మూజ్ జల సంధి మూతపడటంతో క్రూడాయిల్ సప్లై ఆగిందని, అయినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ఆలోచన లేదని చెప్పింది. ప్రస్తుతం భారత్ వద్ద దాదాపు 250 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురుతో పాటు రిఫైన్డ్ పెట్రోలియం నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. ఈ నిల్వలు దేశం మొత్తానికి సుమారు 7 నుంచి 8 వారాల పాటు నిరంతరాయంగా సరిపోతాయని అధికారిక నివేదిక వెల్లడించింది. అయినా జనం మాత్రం ఏ క్షణమైనా పెరగొచ్చని అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఎల్పీజీ కమర్షియల్, డొమెస్టిక్ గ్యాస్ ధరలు పెరగడం దీనికి మరింత ఆజ్యం పోస్తున్నది.

## రాష్ట్రంలో రోజుకు 55 లక్షల లీటర్ల పెట్రోల్

***తెలంగాణ పారిశ్రామికంగా, రవాణాపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నది. దీంతో పెట్రోల్, డీజిల్ వాడకం కూడా ఏటా పెరుగుతున్నది. రాష్ట్రంలో ఏడాదికి 2వేల కోట్ల లీటర్ల పెట్రోల్, 4,500 కోట్ల లీటర్ల డీజిల్ ఉపయోగిస్తున్నాం. రోజువారీగా అయితే.. సుమారు 55లక్షల లీటర్ల పెట్రోల్, 1.25 కోట్ల లీటర్ల డీజిల్ వాడుతున్నాం.***

- రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్‌పై 35.2 శాతం, డీజిల్‌పై 27 శాతం వ్యాట్ వసూలు చేస్తున్నది.
- పెట్రోల్, డీజిల్ కలిపి వ్యాట్ ద్వారా నెలకు సుమారు రూ.1,000 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఏడాదికి సుమారు రూ.12వేల కోట్ల ఆమ్దానీ రాష్ట్ర ఖజానాలో జమ అవుతున్నది.
- 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జనవరి మధ్య పెట్రోల్ వ్యాట్ ద్వారా రూ.13,737 కోట్లు, డీజిల్ ద్వారా రూ.12వేల కోట్ల ఆదాయం వచ్చింది.
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల వాహనాలు కలిపి సుమారు (2026 ప్రారంభం నాటికి) 1.85 కోట్లు ఉంటాయి. అత్యధికంగా సుమారు 1.35 కోట్ల టూ వీలర్లు ఉంటాయి. కార్లు 24 లక్షలు, ఆటో రిక్షాలు 5.5 లక్షల వరకు ఉన్నాయి.
- రాష్ట్రంలోని మొత్తం వాహనాల్లో దాదాపు 40శాతం వెహికల్స్ ఒక్క హైదరాబాద్‌లోనే తిరుగుతున్నాయి. హైదరాబాద్‌లో వ్యక్తిగత వాహనాల సంఖ్య సుమారు 80లక్షలు దాటింది.
- తెలంగాణలో ప్రతి ఏటా సగటున 9 లక్షల నుంచి 10 లక్షల కొత్త వాహనాలు రిజిస్టర్ అవుతున్నాయి.




## సామాన్యులకు షాక్

***హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.107.46, డీజిల్ రూ.95.70 వద్ద ఉంది. గత కొన్ని రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరిగినప్పటికీ, స్థానిక రిటైల్ ధరల్లో మార్పు రాలేదు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. కానీ సామాన్యులపై తీవ్ర భారం పడుతుంది.***

- పెట్రోల్, డీజిల్‌పై ఒక రూపాయి పెరిగితే.. రాష్ట్ర ప్రభుత్వానికి రోజుకు సుమారు రూ.60 లక్షలు, నెలకు సుమారు రూ.18 కోట్ల ఆదాయం వస్తుంది. ఏడాదికి రూ.190 కోట్ల వరకు రా ష్ట్ర ఖజానాకు చేరుతుంది.
- పెట్రోల్, డీజిల్‌పై ఒక రూపాయి పెరిగితే.. రాష్ట్ర ప్రజలపైనా భారీగా భారం పడుతుంది. రాష్ట్ర ప్రజలంతా రోజుకు రూ.1.8 కోట్లు, నెలకు రూ.54 కోట్లు, సంవత్సరానికి రూ.650 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది.
- పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే ఆటో డ్రైవర్లు, ట్రక్ డ్రైవర్లు, రైతులు (డీజిల్ పంపులు), బస్సులు, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు, డెలివరీ సేవలపై ప్రభావం పడుతుంది. ఇవన్నీ పెరిగితే.. కూరగాయలు, రవాణా, సరుకుల ధరలూ పెరుగుతాయి.
- సగటున ఒక మధ్యతరగతి కుటుంబం నెలకు 30 లీటర్ల పెట్రోల్ వాడుతుందనుకుంటే, లీటరుకు రూ.5 పెరిగితే వారి నెలవారీ ఖర్చులో రూ.150 అదనపు భారం పడుతుంది. ఇది చిన్న మొత్తంగా అనిపించినా, అన్ని వస్తువుల ధరల పెరుగుదలతో కలిపి చూస్తే నెలకు 3వేల వరకు అదనపు భారం పడే అవకాశం ఉంది.

- పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడు అది నేరుగా సామాన్యుడి వంటగదిపైనే ప్రభావం చూపుతుంది. దీనిని కాస్కేడింగ్ ఎఫెక్ట్ అంటారు. అంటే, రవాణా ఖర్చులు పెరగడం వల్ల వస్తువుల తయారీ, సరఫరా ఖర్చులు పెరిగి, చివరికి ఆ భారం వినియోగదారుడిపై పడుతుంది.
- పాల వ్యాన్లు రోజూ ఉదయం గ్రామాల నుంచి నగరాలకు వస్తుంటాయి. డీజిల్ ధర పెరిగితే లీటర్ పాలపై రూ.1 నుంచి 2 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.
- నూనె, పప్పుల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతాయి. ఇవి ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతాయి. రవాణా ఖర్చు పెరిగితే వీటి ధరలు కిలోకు రూ.8 నుంచి 10 వరకు పెరుగుతాయి.
- కోళ్ల దాణా రవాణా, ఫామ్ నుంచి మార్కెట్‌కు తరలించే ఖర్చులు పెరగడంతో గుడ్లు, మాంసం ధరలు పెరుగుతాయి.



## అదనంగా రూ. 3వేల ఖర్చు

***పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే సామాన్య, మధ్య తరగతి కుటుంబంపై ఆర్థిక భారం పడుతుంది. కుటుంబంలో ఎవరికీ వెహికల్ లేకపోయినా పరోక్షంగా అదనపు భారాన్ని భరించాల్సి వస్తుంది.***

- బైక్ లేదా కారు ఉంటే నెలకు ప్రత్యక్షంగా రూ.1,500 వరకు అదనపు భారం పడుతుంది. గ్యాస్ ధర పెరగడంతో ఇప్పటికే డొమెస్టిక్‌గా రూ.60 భారం పడింది.
- ట్రాన్స్‌పోర్టు చార్జీలు పెరగడంతో కిరాణా, కూరగాయల ధరలు పెరిగి పరోక్షంగా నెలకు సుమారు రూ.800 వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది.
- పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే.. స్కూల్ బస్ లేదా ఆటో చార్జీలూ పెరుగుతాయి. నెలకు సుమారు రూ.400 వరకు భారం పడుతుంది.
- ఓవరాల్‌గా ఓ సామాన్య, మధ్య తరగతి కుటుంబంపై నెలకు సుమారు రూ.3వేల వరకు అదనపు భారం పడుతుంది.

కలం
09-03-2026, సోమవారం

360° SINGLE TOPIC

వార్ ఎఫెక్ట్

02

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్పీజీ సిలిండర్ల రేట్లను కేంద్ర ప్రభుత్వం పెంచింది. డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.60 చొప్పున భారం మోపింది. దీంతో హైదరాబాద్‌లో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.905 నుంచి రూ.965కు పెరిగింది. మహబూబ్‌నగర్‌లో రూ.968.50, గద్వాలలో రూ.985, హనుమకొండలో రూ.984 చొప్పున ఉంది. దీంతో సామాన్య ప్రజలపై భారం పడుతోంది. రానున్న రోజుల్లో ఎల్పీజీ ధరలు మరింత పెరుగుతాయేమోనన్న భయాందోళన నెలకొంది.

- తెలంగాణ వ్యాప్తంగా 1.49 కోట్ల డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.
- రాష్ట్రంలో రోజుకు సగటున 2.3 లక్షల డొమెస్టిక్ సిలిండర్లను రీఫిల్ చేయించుకుంటున్నారు. ఈ లెక్కన వినియోగదారులపై నెలకు రూ.1.38 కోట్లు, ఏడాదికి రూ.503.70 కోట్ల అదనపు భారం పడుతుంది.

# వంటింట్లో మంట






## సర్కార్‌పై మహాలక్ష్మి భారం..

**రాష్ట్రవ్యాప్తంగా 1.49 కోట్ల మంది డొమెస్టిక్ గ్యాస్ వినియోగదారులు ఉండగా, వీరిలో 42.90 లక్షల మంది మహాలక్ష్మి పథకం లబ్ధిదారులు. ఈ పథకం కింద లబ్ధిదారులకు రూ.500కే సిలిండర్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్నది.**

- ఈ పథకాన్ని 2024 ఫిబ్రవరిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.
- దీని అమలు కోసం బడ్జెట్‌లో దాదాపు రూ.855.22 కోట్లు కేటాయించారు.
- ఇంతకుముందు డొమెస్టిక్ సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.905 ఉండగా, లబ్ధిదారులకు రూ.500కే ప్రభుత్వం అందించేది. మిగతా రూ.405 సర్కారే భరించేది. ఈ లెక్కన ప్రభుత్వంపై నెలకు సగటున రూ. 80 కోట్ల నుంచి 100 కోట్ల వరకు భారం పడుతోంది.
- ఇప్పుడు సిలిండర్ ధరల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై మరింత భారం పడనుంది. సర్కార్ ఒక్కో సిలిండర్‌పై రూ.60 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అంటే ప్రభుత్వంపై అదనంగా మరో రూ.25 కోట్లకు పైగా భారం పడుతుంది.
- మహాలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు రూ.500కే సిలిండర్ అందిస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో మాత్రం తమకు సబ్సిడీ అందడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.



## ఆందోళన వద్దు

యుద్ధం కారణంగా పశ్చిమాసియాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్నాయి. పశ్చిమాసియా నుంచే మన దేశానికి ఎక్కువగా ఆయిల్, గ్యాస్ వస్తుంది. లక్షలాదిమంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో  ఉపాధి పొందుతున్నారు. వారితో పాటు లోకల్ గా సామాన్యుల విషయంలో కేంద్రం ఫస్ట్ ప్రయారిటీ ఇస్తున్నది. యుద్ధం వల్ల తలెత్తే పరిణామాలను ఎదుర్కొనేందుకు రెడీగా ఉన్నాం. ఇతర దేశాల్లో చిక్కుకున్న మన వాళ్లను తీసుకురావడానికి చర్యలు చేపట్టాం. ఇంధన భద్రత, సప్లయ్ చైన్ లో ఎక్కడా ఇబ్బంది రాకుండా ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాం. ఎవరూ ఆందోళన చెందొద్దు.

*– లోక్ సభలో కేంద్ర మంత్రి జైశంకర్*



# ఇడ్లీ నుంచి బిర్యానీ దాకా

## .. పెరుగుతున్న రేట్లు

- ఇప్పటికే కమర్షియల్ సిలిండర్ రేట్‌ను రూ. 115 పెంచిన కేంద్రం
- ఇంకా పెరగొచ్చన్న ఆందోళనలో వ్యాపారులు
- ప్లేట్ ఇడ్లీ రూ. 40 నుంచి 50కి పెంచిన టిఫిన్ సెంటర్లు
- బ్యాచిలర్స్, ఐటీ ఎంప్లాయీస్‌కు తప్పని తిప్పలు

**వీధిలో ఇడ్లీ దుకాణమైనా.. సెంటర్ లో బిర్యానీ పాయింట్ అయినా.. వాడేది కమర్షియల్ సిలిండర్! యుద్ధం ఎఫెక్ట్ తో ఆ సిలిండర్ ధర పెరగడంతో హైదరాబాద్ లోని పలు ఏరియాల్లో ఇప్పటికే ఫుడ్ ఐటమ్స్ రేట్లు పెంచారు. నిన్న మొన్నటి వరకు రాంనగర్, అశోక్ నగర్, చింతల్ బస్తీ వంటి ఏరియాల్లో ప్లేట్ ఇడ్లీ రూ. 40 ఉండగా.. ఇప్పుడు కొందరు టిఫిన్ సెంటర్ల యజమానులు దాన్ని 50కి పెంచారు. యూసుఫ్ గూడ, పంజాగుట్టలో అయితే ఏకంగా రూ.60 వరకు చేశారు.**

- కమర్షియల్ సిలిండర్ ధర ఏకంగా 115 రూపాయలు పెరిగింది. మూడురోజుల కిందటి వరకు హైదరాబాద్ లో 1,883 రూపాయలు ఉన్న 19 కిలోల కమర్షియల్ సిలిండర్ రేటు ఇప్పుడు రూ. 2016 అయింది.
- హైదరాబాద్ లో స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు లక్షన్నర వరకు ఉంటారు.  ఐటీ హబ్ లు ఎక్కువగా ఉన్న మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, కూకట్ పల్లి, అమీర్ పేట్ తో పాటు దిల్ సుఖ్ నగర్, అశోక్ నగర్ ఏరియాల్లో ఈ వ్యాపారాలు జోరుగా నడుస్తుంటాయి.  ఒక్కో  బండిపై రూ. 3 వేల నుంచి 10 వేల దాకా వ్యాపారం నడుస్తుంది.  నగరం మొత్తంలో రోజుకు రూ. 20 కోట్ల మేర ఈ బిజినెస్ నడుస్తుంది.
- కమర్షియల్ గ్యాస్ రేట్లు పెరగడంతో స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు కూడా తమ ఫుడ్ ఐటమ్స్ ధరలను పెంచారు. తమకు గిట్టుబాటు కావడం లేదని, అందుకే పెంచాల్సి వచ్చిందని అంటున్నారు. ధరలు పెంచడంతో కస్టమర్స్ తగ్గిపోయే ప్రమాదం ఉందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- పది లక్షల వరకు ఐటీ ఉద్యోగులు ఉన్న హైదరాబాద్ లో దాదాపు 70 శాతం మంది ఈ స్ట్రీట్ ఫుడ్ పైనే ఆధారపడుతుంటారు. ఉదయం టిఫిన్ తో మొదలు రాత్రి సెంటర్ లో బిర్యానీ పాయింట్ వరకు వీరితో కిటకిటలాడుతుంటాయి. అయితే.. గ్యాస్ ఎఫెక్ట్ కారణంగా ఫుడ్ రేట్లు పెరగడంతో కొనుగోలు శక్తి తగ్గే చాన్స్ ఉంది. వివిధ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే వాళ్లు కావొచ్చు.. చదువు కోసం హైదరాబాద్ కు వచ్చి హాస్టళ్లలో ఉండే వాళ్లు కావొచ్చు.. ఇలా బ్యాచిలర్స్ కూడా వీటిపైనే ఆధారపడుతుండటంతో వారికి కూడా భారంగా మారనుంది.
- నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్  ఇండియా 2024 లెక్కల ప్రకారం హైదరాబాద్ లో చిన్నా పెద్ద రెస్టారెంట్లు కలిపి దాదాపు 70 వేల వరకు ఉంటాయి. ఇందులో 15 వేల వరకు ప్రత్యేకంగా బిర్యానీని అమ్మేవి ఉంటాయి. రోజువారీగా ఫుడ్ ఆర్డర్లు (జొమాటో, స్విగ్గీ వంటి ప్లాట్ ఫామ్స్ లో) 60 శాతం వాటా బిర్యానీదే. ప్రస్తుతం ఆర్టీసీ క్రాస్ రోడ్స్, చిక్కడపల్లి, నారాయణగూడ వంటి ఏరియాల్లోని బిర్యానీ సెంటర్లలో మినీ చికెన్ బిర్యానీ రూ. 120 ఉండగా.. కొన్ని చోట్ల దీన్ని  140కి పెంచారు.






## బుక్ చేస్తే వారానికి డెలివరీ..

గ్యాస్ సిలిండర్ల షార్టేజ్ అప్పడే మొదలైంది. గతంలో బుక్ చేసిన రెండ్రోజుల్లోనే డెలివరీ అయ్యేది. కానీ ఇప్పుడు వారం నుంచి 10 రోజులు పడుతోంది. మరోవైపు ధరల పెరుగుదల కంటే ముందే బుక్ చేసుకున్నోళ్లకు సిలిండర్లు ఆలస్యంగా డెలివరీ అయ్యాయి. దీంతో కొత్త ధరలు చెల్లించాలని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అంటున్నారని వినియోగదారులు వాపోతున్నారు. బుకింగ్ ఎప్పుడు చేసుకున్నా, సిలిండర్ డెలివరీ అయిన రోజు ఉన్న ధరనే చెల్లించాల్సి ఉంటుందని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు పేర్కొన్నారు.

కలం
09-03-2026, సోమవారం

360° SINGLE TOPIC
## వార్ ఎఫెక్ట్
03

# మన పసుపు, కారం ఎగుమతులపై ఎఫెక్ట్

**మిడిల్ ఈస్ట్ లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఇండియా నుంచి పశ్చిమ ఆసియా దేశాలకు ఎగుమతి అయ్యే సుమారు రూ.98 వేల కోట్ల విలువైన సరుకులపై ఎఫెక్ట్ పడింది. పశ్చిమాసియాకు వెళ్లే మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో 21.8 శాతం వాటా ఇండియాదే. ఇక్కడి నుంచి బాస్మతి బియ్యం, మేక మాంసం, గొర్రె మాంసం, చక్కెర, కోకో ఉత్పత్తులతోపాటు తెలంగాణ నుంచి ప్రత్యేకంగా పసుపు, కారం వంటివి వెళ్తుంటాయి.**



- పశ్చిమ ఆసియా దేశాల్లో ఇండియన్లు ఎక్కువగా ఉండటంతో మన తెలంగాణ సోనా మసూరి వంటి రకాలకు అక్కడ భారీ డిమాండ్ ఉంది. ముఖ్యంగా.. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ దేశాలకు ఎక్కువ ఎగుమతి అవుతుంటాయి. తెలంగాణ గొర్రె, మేక మాంసం ప్రతి రోజు విమానాల ద్వారా దుబాయ్, ఖతార్ వంటి దేశాలకు వెళ్తుంటాయి. నిజామాబాద్ నుంచి పసుపు, ఇతర జిల్లాల నుంచి ఎండు మిర్చి పశ్చిమ ఆసియా మార్కెట్లకు చేరుతాయి.
- నిజామాబాద్ జిల్లా తెలంగాణలోనే పసుపు సాగులో అగ్ర స్థానంలో ఉంది. ఏడాదికి 80వేల టన్నుల పసుపు పండుతుంది. ఆర్మూర్ ఏరియాలో పండించే పసుపు.. అంతర్జాతీయంగా ఫేమస్. యూఏఈ, ఇరాన్, సౌదీ అరేబియా, మొరాకో, కువైట్, ఖతార్ దేశాలకు నిజామాబాద్ పసుపు వెళ్తుంది. ఏడాదికి 15వేల టన్నుల పసుపు వెస్ట్ ఆసియా దేశాలకు ఎగుమతి అవుతుంది.
- హైదరాబాద్ నుంచి జనరిక్ మందులు, బల్క్ డ్రగ్స్ సరఫరా అవుతుంటాయి. పెట్రో కెమికల్స్ ఉత్పత్తులు, ఇతర పారిశ్రామిక రసాయనాలు కూడా ఎగుమతి అవుతుంటాయి. యుద్ధం కారణంగా పశ్చిమాసియా అట్టుడుకుతుండటంతో మన దగ్గరి నుంచి ఎగుమతులకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి.




# డ్రై ఫ్రూట్స్ ధరలు పైకి!

**పశ్చిమాసియా నుంచి అనేక రకాల వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంటోంది. యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఒమన్, ఇరాన్, ఇరాక్ తదితర దేశాల నుంచి ఏటా రూ.లక్షల కోట్ల వాణిజ్యం జరుగుతోంది. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి క్రూడాయిల్, పెట్రోలియం ఉత్పత్తులు, లిక్విడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ), లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ), ఫెర్టిలైజర్స్, రఫ్ డైమండ్స్, డ్రై ఫ్రూట్స్, జిప్సం సహా ఇతర మినరల్స్‌ను భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఇప్పుడు యుద్ధం కారణంగా ఈ ఉత్పత్తుల దిగుమతిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.**

- మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి డ్రై ఫ్రూట్స్‌లో ఎక్కువగా ఖర్జూరా, బాదం, పిస్తా, అప్రికాట్ తదితర భారత్‌కు దిగుమతి అవుతాయి.
- ప్రస్తుతం రంజాన్ నెల. ఈ టైమ్‌లో ముస్లింలు ఎక్కువగా డ్రై ఫ్రూట్స్ తింటారు. వాటికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. తెలంగాణలో దాదాపు 65 లక్షల మంది ముస్లింలు ఉన్నారని అంచనా. ఒకవేళ యుద్ధం ఇలాగే కొనసాగితే మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి డ్రై ఫ్రూట్స్ దిగుమతులు తగ్గి, డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. తద్వారా ధరలు పెరగొచ్చు.

